# Joint Press Release on First Meeting of India-Maldives Joint Working Group on Counter Terrorism, Countering Violent Extremism and De-Radicalisation

April 08, 2021

---

# ఉగ్రవాద నిరోధం, హింసాత్మక తీవ్రవాదాన్ని ఎదుర్కోవడం మరియు డి-రాడికలైజేషన్‌పై భారత్-మాల్దీవుల జాయింట్ వర్కింగ్ గ్రూప్ మొదటి సమావేశంపై ఉమ్మడి పత్రికా ప్రకటన

ఏప్రిల్ 08, 2021

ఉగ్రవాద నిరోధం, హింసాత్మక తీవ్రవాదాన్ని ఎదుర్కోవడం మరియు డి-రాడికలైజేషన్‌పై భారత్-మాల్దీవుల మధ్య జాయింట్ వర్కింగ్ గ్రూప్ మొదటి సమావేశం 08 ఏప్రిల్ 2021న న్యూఢిల్లీలో జరిగింది. భారతీయ పక్షానికి విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సెక్రటరీ (పశ్చిమ) శ్రీ వికాస్ స్వరూప్ నేతృత్వం వహించారు అలాగే మాల్దీవుల పక్షానికి విదేశాంగ కార్యదర్శి శ్రీ అబ్దుల్ ఘఫూర్ మహమ్మద్ సారథ్యం వహించారు. ఈ సమావేశం సుహృద్భావ మరియు నిర్మాణాత్మక వాతావరణంలో జరిగింది. భారత్ మరియు మాల్దీవుల మధ్య కాలపరీక్షకు తట్టుకొని నిలబడిన మంచి ఇరుగుపొరుగు సంబంధాలు అలాగే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరియు అధ్యక్షుడు ఇబ్రహీం మహమ్మద్ సోలిహ్ నాయకత్వంలో మన ద్వైపాక్షిక సంబంధాలు సంతరించుకున్న శక్తి, ఆశయం అలాగే స్థాయికి ఇది సంకేతంగా నిలిచింది.

సీమాంతర ఉగ్రవాదం సహా అన్ని రూపాల్లో ఉన్న ఉగ్రవాదాన్ని మరియు వ్యక్తీకరణలను భారత్ మరియు మాల్దీవులు తీవ్రంగా ఖండించాయి అలాగే ఉగ్రవాదాన్ని సమగ్రంగా మరియు స్థిరమైన ధోరణితో ఎదుర్కోవడానికి అంతర్జాతీయ సహకారాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించాయి. ఐక్య రాజ్యసమితి (యూఎన్) ఆంక్షల కింద ఉన్న ఉగ్రవాద సంస్థల వల్ల తలెత్తుతున్న ముప్పులను ఇరు పక్షాలు సమీక్షించాయి అలాగే అన్ని ఉగ్రవాద నెట్‌వర్క్‌లపైనా సమిష్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఉద్ఘాటించాయి. ఏ దేశం కూడా తమ అధీనంలోని భూభాగాన్ని ఇతర దేశాలపై ఉగ్రవాద దాడులకు ఉపయోగించడం లేదని నిర్ధారించే విధంగా అలాగే ఇలాంటి దాడులకు పాల్పడిన నేరస్తులను వేగంగా చట్టం ముందుకు తీసుకొచ్చేలా అన్నిదేశాలూ తక్షణం, సుస్థిరమైన, ధ్రువీకరించదగిన, మార్చడానికి వీల్లేని అత్యవసర చర్యలను చేపట్టాల్సి ఉందని నొక్కిచెప్పాయి.

2019 జూన్‌లో ప్రధాన మంత్రి మోదీ మాల్దీవుల పర్యటన సందర్భంగా జారీ చేసిన ఉమ్మడి ప్రకటనను ప్రస్తావిస్తూ... ఉగ్రవాదం, హింసాత్మక తీవ్రవాదం మరియు రాడికలైజేషన్ కారణంగా ఈ ప్రాంతంలో శాంతి మరియు భద్రతలకు తలెత్తుతున్న తీవ్రమైన ముప్పులను ఇరు పక్షాలు గుర్తించాయి. ఇలాంటి ముప్పులను ఎదుర్కొనేందుకు అధ్యక్షుడు సోలిహ్ ప్రభుత్వం అనుసరిస్తున్న సుస్పష్ట దృష్టితో కూడిన వైఖరిని అలాగే ఈ విషయంలో మాల్దీవులు చేపట్టిన పటిష్టమైన చర్యలను భారత్ కొనియాడింది.

రాడికలైజేషన్ మరియు హింసాత్మక తీవ్రవాదాన్ని ఎదుర్కోవడం, ఉగ్రవాదానికి ఆర్థిక సహాయానికి అడ్డుకట్ట వేయడం, ఉగ్రవాదం మరియు హింసాత్మక తీవ్రవాదానికి ఇంటర్నెట్‌ను ఉపయోగించడాన్ని నిరోధించడం, పోలీసులు, భద్రతా దళాలు, కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్ మరియు ఇతర సంబంధిత ఏజెన్సీల మధ్య సమాచార మార్పిడి, సామర్థ్య నిర్మాణం మరియు సంస్థాగత అనుసంధానతలను నెలకొల్పడం సహా ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో వివిధ రంగాల్లో సహకారంపై ఇరు పక్షాలు అభిప్రాయాలను పంచుకున్నాయి. అదేవిధంగా, మాదక ద్రవ్యాలు మరియు డ్రగ్స్ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవడంపై ఇరు పక్షాలు అభిప్రాయాలను పంచుకున్నాయి. కోవిడ్-19 మహమ్మారి కారణంగా ఉగ్రవాదం, రాడికలైజేషన్ మరియు హింసాత్మక తీవ్రవాదాన్ని ఎదుర్కొనే విషయంలో తలెత్తిన సవాళ్లపై కూడా ఈ సమావేశంలో చర్చలు జరిగాయి.

మాల్దీవులకు చెందిన భద్రత మరియు దర్యాప్తు సంస్థలు ఇతర సంబంధిత ఏజెన్సీలకు సహాయం మరియు సామర్థ్య నిర్మాణం సహా సహకారాన్ని బలోపేతం చేసుకోవడానికి, అదేవిధంగా ఉగ్రవాద నిరోధం, హింసాత్మక తీవ్రవాదాన్ని ఎదుర్కోవడం మరియు నివారించడం అలాగే అలాగే డి-రాడికలైజేషన్ రంగాల్లో అత్యుత్తమ విధానాలను పంచుకోవడం మరియు భాగస్వామ్యానికి ఇరు పక్షాలు అంగీకరించాయి. బహుళపక్ష వేదికల్లో సహకారంపై కూడా ఇరు పక్షాలు చర్చించాయి.

న్యూఢిల్లీలో విడిది సందర్భంగా మాల్దీవుల ప్రతినిధి బృందం నేషనల్ సెక్యూరిటీ గార్డ్ మరియు బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌ను కూడా సందర్శించనుంది.

**న్యూఢిల్లీ**

**ఏప్రిల్ 08, 2021**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA's website and may be referred to as the official press release.